క్లుప్తంగా

చౌత్రా స్కూల్లో స్వస్థ ఇండియా కార్యక్రమం



గుంటూరు ఎడ్యుకేషన్: చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం డెట్టాల్ బనేగా స్వస్థ ఇండియా ఆధ్వర్యంలో హైజీన్ కల్చర్ ప్రమోషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శార్ప్ గ్రామాలయ సహకారంతో విద్యార్థినులకు హ్యాండ్ వాష్ ప్రాముఖ్యత వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని 40 పాఠశాలల్లో హ్యాండ్ వాష్ వాల్ పెయింటింగ్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, డీబీఎస్ఈ ప్రోగ్రామ్ మేనేజర్ నళిని, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపశమనపు చినుకులు!

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవార సాయంత్రం వర్షం కురిసింది. వేసవికాలం ముగిసినప్పటికీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో నగర ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క ఎండ వేడిమి ఉక్కపోతతో అల్లాడిపోతున్న నగర్ వాసులకు వర్షాలు పడటం ఒకింత ఉపశమనాన్ని కలిగించింది.

రాజ్యాంగంపై రాత పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచేందుకు సెప్టెంబరు 10న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు కుల నిర్మూలన కలయిక సంస్థకు ఉపాధ్యక్షుడు టి.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం గురించి పరీక్ష రాసేందుకు 15 పైబడిన ప్రతి ఒక్కరూ అర్హులని పేర్కొన్నారు. మెరిట్ సాధించిన పది మందికి బహుమతులు అందజేస్తామని, బహుమతులు రాజ్యాంగ దినోత్సవం రోజు జరిగే సభలో అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 70326 86204, 9441268501 నంబర్లను సంప్రదించాలన్నారు.

5న పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

గుంటూరు ఎడ్యుకేషన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ చేపడుతున్నట్లు సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాయి చరణ్‌గుప్తా తెలిపారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ప్రాంగణంలో ఏబీవీపీ నగర శాఖ ఆధ్వర్యంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. సాయి చరణ్‌గుప్తా మాట్లాడుతూ పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 30వేల పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలని కోరారు. సీబీఎస్ఈ పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించడంతో పాటు ఫీజుల నియంత్రణకు కలెక్టర్, విద్యాశాఖాధికారులు, తల్లిదండ్రుల, విద్యార్థి సంఘాల భాగస్వామ్యంతో కమిటీలను నియమించాలని డిమాండ్ చేశారు. నారాయణ, శ్రీచైతన్య, భాష్యం వంటి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రవి, ప్రసాద్, శ్రీకాంత్, దివాకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ పోషణ

గుంటూరు ఎడ్యుకేషన్: చిరుధాన్యాలతో శరీరానికి సంపూర్ణ పోషణ లభిస్తుందని యునివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్లాంట్ సైన్సెస్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. ముత్తమిలరసన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బయోకెమిస్ట్రీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాలు సంయుక్తంగా 'పొటెన్షియల్ ఆఫ్ మైటీ మిల్లెట్స్' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ వేదికగా డాక్టర్ ముత్తమిలరసన్ పాల్గొని మాట్లాడుతూ వరి, గోధుమల్లోని గ్లైకమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉండటం వలన మధుమేహం, ఊబకాయం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని, చిరుధాన్యాల్లో వీటి ఇండెక్స్ తక్కువగా ఉండటంతో పాటు మాంసకృత్తులు, ఖనిజాలతో అధిక పోష కాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనపై బీజేపీ గుంటూరు తూర్పు కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో పాతగుంటూరు, సుద్దపల్లి డొంక, గొలుసు కొండలరావు నగర్ ప్రాంతాల్లో బీజేపీ నేతలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో కామేపల్లి వెంకటేశ్వరరావు, షేక్ గౌస్‌పీరా, షేక్ రఫీ, నాగమల్లేశ్వరి, నాగమోహన్, లక్ష్మణరావు, శివపార్వతి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాల్సింది విభాగాధిపతులే

- ఏ ఒక్క సమస్య పునరావృతం కాకూడదు
- నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల నేరుగా రాష్ట్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం యాక్షన్ ప్లాన్ సచివాలయాల వారీగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్ ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్ లో పోస్ట్ చేసి, పరిష్కారాల పై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు.

ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 35 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజనీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 1, ఉపాసెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 8, పరిపాలన విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరిండెంట్లు పాల్గొన్నారు.

ఎందుకు హతమార్చారు?

- కొలిక్కిరాని వృద్ధురాలి హత్య కేసు
- బంగారం కోసమా, కుటుంబ కలహాలా?
- సర్వత్రా అనుమానాలకు తావిస్తున్న కేసు

పట్నంబజారు: గుంటూరువారితోటలో ఆదివారం జరిగిన వేనుగంటి విజయలక్ష్మి (65) హత్య కేసు పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నప్పటికీ ఒక కొలిక్కి రాలేదని తెలుస్తోంది. విజయలక్ష్మి గురించి పక్కాగా తెలిసిన వ్యక్తులు ఈ హత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమిక అంచనాకు వచ్చిన పోలీసులు ఎవరై ఉంటారనేది.. మాత్రం అర్థం కాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఈ హత్య జరిగింది. సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చిన వ్యక్తి చూసి సమాచారాన్ని అందించటంతో పోలీసులు రంగంలోకి దిగారు. అయితే వృద్ధురాలిని హతమార్చేటప్పుడు తీవ్ర పెనుగులాట జరిగిందనే తెలుస్తోంది. విజయలక్ష్మిని హత్య చేసిన గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని గొలుసు, ఉంగరం, చెవి దిద్దులు మాత్రమే తీసుకుని వెళ్లారని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న బీరువాను ఏ మాత్రం కదిలించ లేదు. తలపై ఇనుపరాడ్డు వంటి పరికరంతో కొట్టి చంపిన దుండగులు.. దోపిడీకి వచ్చి ఉంటే.. ఖచ్చితంగా పక్కనే ఉన్న బీరువాను కూడా పగులకొట్టి ఉండాలనే పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. విజయవాడలోని కుమార్తె జ్యోత్స్న వద్ద ఎక్కువగా ఉంటున్న విజయలక్ష్మి గత నెల 30వ తేదీన వచ్చిన విషయం తెలిసే ఈ హత్య చేసి ఉంటారనే అభిప్రాయాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇదీ దొంగల పనా? లేక కుటుంబ కలహాలా? ఇతర అంశాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిగా ఒకరోజు గడిచినప్పటికీ స్పష్టమైన నిర్ణయం మాత్రం తీసుకోలేకపోతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే స్థానికంగా విచారించటంతో పాటు, సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆధారాల కోసం తలమునకలవుతున్నారు. వృద్ధురాలి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఎలా చేధిస్తారో వేచిచూడాల్సిందే.

అథ్లెట్ రేష్మికి అభినందనలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల ఒడిషాలోని భువనేశ్వర్‌లో ముగిసిన జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో గుంటూరుకు చెందిన కే.రేష్మికి జావెలిన్ త్రోలో కాంస్య పతకం దక్కిందని అథ్లెటిక్ కోచ్ జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేష్మిని సహస్ర ఆర్థో అండ్ న్యూరో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ఎం.శివ కుమార్ అభినందించారని తెలిపారు. క్రీడలను తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక గుంటూరు జిల్లాలో లబ్ధిదారులకు వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ మూడో రోజైన శనివారం అందజేశారు. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరిష్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో సోమవారం సాయంత్రం నాటికి 96.63 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,50,490 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.82 కోట్లు కేటాయించింది. సోమవారం సాయంత్రానికి 2,42,039 మంది లబ్ధిదారులకు రూ.66.49 కోట్ల నగదు అందజేశారు.

న్యాయం చేయాలి

గుంటూరు ఈస్ట్: కన్నావారితోటలోని యూనియన్ బ్యాంకులో ఈ నెల 1వ తేదీ మంగళగిరికి చెందిన విద్యుత్ కార్మికుడు రాపర్తి రామకృష్ణ మరణానికి కారకులైన బ్యాంకు మేనేజర్, కాంట్రాక్టర్లను తక్షణమే అరెస్టు చేయాలని సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్ వై.కె సోమవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. నేరపూరిత నిర్లక్ష్యం వహించి కార్మికుడి మృతికి కారకులైన వారిపైన ఇండియన్ పీనల్ కోడ్‌లోని 304 క్లాజ్-2 కింద పోలీసు అధికారులు కేసు నమోదు చేయాలని కోరారు. అసత్య ప్రచారాలు చేస్తున్న వారి దుష్ట వైఖరిని ఖండిస్తున్నామన్నారు.

నగరంలో వైభవంగా గురుపౌర్ణమి



విద్యానగర్ సన్నిధానంలో సాయినాధుని పూజిస్తున్న భక్తులు



మల్లారెడ్డినగర్‌లో అలంకరణలో అమ్మవారు

పాత గుంటూరు: నగరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పర్వదినం సందర్భంగా ఆలయాల్లో సాయినాధుడు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాత గుంటూరు, అరండల్‌పేట, కన్నావారితోట, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యానగర్ 3వ లైనులోని సాయినాధ సన్నిధానంలో సాయినాధుడు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సద్గురువుని దర్శించి కొలిచారు. ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వి. శివరామకృష్ణయ్య, కార్యదర్శి స్వరూపారాణి, సంజీవరావు, అప్పారావు, బ్రహ్మేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

మల్లారెడ్డినగర్‌లోని ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రాంగణంలోని రామలింగేశ్వరస్వామి పర్వత వర్ధిని సరస్వతి అమ్మవార్లకు శాకంబరి అలంకారం చేసి విశేష పూజలను నిర్వహించారు. చంద్రశేఖర శర్మ, శివ కుమారశర్మ నిర్వహణలో ప్రత్యేక పూజలు, విశేష హారతి అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జాయ్ అండ్ షైన్‌లో..

గుంటూరు వెస్ట్: గురువులేని జీవితం దిక్సూచి లేని నావ వంటిదని వెల్‌నెస్ చీఫ్ కోచ్ జ్యోతి శ్యామ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని జాయ్ అండ్ షైన్ హెల్త్‌కేర్ సెంటర్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మీద గురువును దైవంగా భావించే గొప్ప సంస్కృతి మన దేశంలోనే ఉందన్నారు. మన ప్రాచీన మహర్షులు గురువుల పాత్ర పోషించడం వల్లే ప్రస్తుతం ఉన్న విజ్ఞాన సంపద సామాన్యులకు కూడా చేరుతుందన్నారు. బీఈడీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.యానీ అమల మాట్లాడుతూ విద్య చెప్పే భాగ్యం ఎందరికోగాని దక్కదన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువులదే అగ్రస్థానమని చెప్పారు. విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు బోధిస్తే వారు రానున్న కాలంలో ఉత్తమ పౌరులుగా నిలుస్తారని చెప్పారు. అనంతరం సెంటర్ సభ్యులు జ్యోతి శ్యామ్, యానీ అమలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోచ్‌లు అయితి సతీష్, అనూషా బేబి, సంధ్య, పవన్ కళ్యాణ్, భావన్నారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు



డాక్టర్ కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను సోమవారం ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ (వైఎస్సార్ ట్రేడ్ యూనియన్) జీజీహెచ్ శాఖ అధ్యక్షుడు వి.యోహాన్ ఆధ్వర్యంలో పలువురు యూనియన్ నాయకులు కలిసి శాలువా కప్పి సత్కరించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా ఆసుపత్రిలో చేసిన వైద్య సేవల గురించి యూనియన్ నేతలు కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో యూనియన్ నాయకులు నమ్రత్‌కుమార్, ఎం.వి.రత్నం, గాబ్రియేల్, సుబ్బారావు, తిరుమలాదేవి, సుశీల్‌కుమార్, మనోజ్‌కుమార్, మేడిదబాబు తదితరులు ఉన్నారు.

సిరంజ్‌లు అందజేస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

నూతనంగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలిసి శాలువా కప్పి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. రోగుల వినియోగం కోసం గ్లౌజులు, సిరంజ్‌లు ఏపీ ఎన్జీవో నేతలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ సతీష్ కుమార్, నగర అధ్యక్షుడు సూరి, నగర సెక్రటరీ కళ్యాణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, వెల్లంపల్లి పద్మజ, బెల్లంకొండ శైలజ, రాధారాణి, కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్, గాబ్రియేల్ పాల్గొన్నారు.

దాతలసహాయం అభినందనీయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతల సహాయం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం జీజీహెచ్ ఎనస్థీషియ విభాగం వారు, మమతా మెడికల్స్ అధినేత కె.చంద్రశేఖర్‌లు రూ. 50వేలు విలువ చేసే పరికరాలు సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఎనస్థీషియా విభాగం వారు రోగుల కోసం గ్లౌజులు, సబ్బులు అందజేశారు. దాతలకు డాక్టర్ కిరణ్‌కుమార్ అభినదంనలు తెలిపారు. మమతా మెడికల్స్ అధినేత చంద్రశేఖర్ రెండు బీపీ ఆపరేటర్లు, రెండు గ్లౌజు మీటర్లు, సర్జికల్ మాస్కులు, సిరంజ్‌లు, ఫేస్ మాస్కులు అందజేశారు. ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ పోలయ్య, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ నాగబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: విద్యార్థులు చదవుతో పాటు తమకు నచ్చిన క్రీడల్లో కూడా పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సిలంబం పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన మున్సిపల్ స్కూల్ విద్యార్థి దిలీప్ కుమార్‌ను సోమవారం కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉంటారన్నారు. సిలంబం అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి సిలంబం పోటీల్లో నగరపాలక సంస్థ పరిధిలోని కెఎస్ఆర్ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థి ఎం.దిలీప్ కుమార్ బంగారు పతకం సాధించి ఈ నెల 9న వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవ్వడం అభినందనీయమన్నారు. దిలీప్ కుమార్‌కు ఉచితంగా శిక్షణ ఇచ్చిన సిలంబం కోచ్ వర్మ రుద్రరాజును కూడా ప్రత్యేకంగా అభినందించారు.

ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎంపీ నందిగం సురేష్‌ను సత్కరించిన సంస్థ నిర్వాహకులు

పాత గుంటూరు: నగరంలోని శుభం కళ్యాణమండపంలో రెడ్ కార్పెట్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సంస్థ ఆర్గనైజర్ ఆర్. కె. నాయుడు, శైలజారామ్ అతిథులను సత్కరించారు.

వృద్ధుల సమస్యకు పరిష్కారం



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్

లక్ష్మీపురం: సాంకేతిక లోపాల కారణంగా 123వ సచివాలయ పరిధిలోని మ్యాపింగ్‌లో ఇద్దరు వృద్ధురాళ్ల పేర్లు ఒకే నివాస గృహంలో ఉన్నట్లు చూపిస్తున్న సమస్యను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిష్కరించి వేరు చేయడం అభినందనీయమని 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత అన్నారు. స్థానిక కోబాల్ట్‌పేటలోని 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 17వ తేదీన 123వ సచివాలయ పరిధిలోని షేక్.మహబూబి అనే 97 సంవత్సరాల వృద్ధురాలు, షేక్.బిబిజాన్ అనే మారో వృద్ధురాలి పేర్లు కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఒకే నివాసంలో ఉన్నట్లు మ్యాపింగ్‌లో నమోదైందన్నారు. ఈ విషయం మార్చి 17న అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, జూన్ 28వ తేదీన ఒకే నివాసంలో ఉంటు ఆన్‌లైన్ మ్యాపింగ్‌లో చూపిస్తున్న ఇద్దరు వృద్ధురాళ్లను వేరు చేయడం జరిగిందని తెలిపారు.

వేరు చేసినటువంటి మ్యాపింగ్‌ను షేక్. బిబిజాన్ అనే వృద్ధురాలి సంబంధిత నివాసంలో ఉంటున్న బదిలీ చేసి ధ్రువపత్రాన్ని ఆదివారం అందజేయడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో డివిజన్ అడ్మిన్ శ్రావణ్‌కుమార్, వెల్ఫేర్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ ఎం.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆరుగురిలో ఒకరికి సంతానలేమి

వయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ వి.రమ్య



డాక్టర్ ప్రభావతిని సన్మానిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్: ప్రతి ఆరుగురిలో ఒకరు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారని వయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ వి.రమ్య పేర్కొన్నారు. ఫెర్టిలిటి సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జంక్‌ఫుడ్ తీసుకోవడం, శారీరక వ్యాయామం లేకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం కూడా సంతానలేమికి కారణాలుగా పేర్కొన్నారు. పెళ్లి అయిన జంట ఏడాది తరువాత కూడా గర్భం దాల్చకపోతే ఫెర్టిలిటీ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ మహిళ జీవితంలో సంతానం కలుగకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. ఫెర్టిలిటీ సెంటర్ల ద్వారా 75 శాతం సమస్యలను అధిగమించవచ్చునన్నారు. తక్కువ ఖర్చుతో గర్భధారణను అందిస్తున్న వయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులను అభినందించారు. ఈసందర్భంగా డాక్టర్‌ప్రభావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరీ ఉత్సవం



ఊరేగింపులో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు (ఇన్‌సర్టులో) గోరింటాకు అలంకారంలో అమ్మవారు

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలో వేంచేసి ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మూలా నక్షత్రం, ఆషాఢ మాస పౌర్ణమి సందర్భంగా శాకంబరీ, గోరింటాకు అలంకారాలతో భక్తులకు సోమవారం దేదీప్యమానంగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆధ్యాత్మిక పరిమళాల నడుమ అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు జరిగాయి. అనంతరం పసుపు కుంకుమ, గాజులు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారె సమర్పణ ఊరేగింపు శోభాయమానంగా కొనసాగింది.

కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కొత్తూరి వెంకట నరసింహారావు, కార్యదర్శి తెల్లాకుల లక్ష్మీ గురు ప్రసాద్, కోశాధికారి పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, డోగిపర్తి సుజాత, పుల్లారావు, సురేష్ పర్యవేక్షించారు.

వార్డుల్లో సూపరింటెండెంట్ తనిఖీలు



క్యాజువాలిటిలో రోగిని పరిక్షిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వరుసగా మూడురోజులుగా ఆసుపత్రిలో పలు వార్డులు తనిఖీ చేస్తున్నారు. సోమవారం క్యాజువాలిటీలో తనిఖీలు చేశారు. రోగులు ఎక్కువ సేపు క్యాజువాలిటీలో వేచి ఉండకుండా సత్వరమే వారికి చికిత్స అందించి వార్డుకు తరలించాలని వైద్యులను ఆదేశించారు. రోగి చెయ్యి పూర్తిగా కుళ్లిపోయి ఉన్న రోగిని గమనించి డాక్టర్ కిరణ్ కుమార్ స్వయంగా కట్టు కట్టి వార్డుకు పంపించి ఆపరేషన్ చేయాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు.

సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం

ఆసుపత్రిలోని పలు వార్డులను సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు డాక్టర్ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి కాన్పుల వార్డు వరకు సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ విధుల్లో లేకపోవడంతో సెక్యూరిటీ సూపర్‌వైజర్లపై మండిపడ్డారు. సెక్యూరిటీ సిబ్బంది ఎప్పుడు విధులకు వస్తున్నారు, వారి హాజరు పట్టీలు తనిఖీ చేశారు. సెక్యూరిటీ సిబ్బంది ఎంత మంది ఉన్నారనే విషయాన్ని ఆసుపత్రి సార్జంట్ కూడా చెప్పకుండా బిక్కమొఖం వేయడంతో సెక్యూరిటీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో మార్పులు తీసుకు రావాలని నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓకు డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కాన్పుల వార్డులో తనిఖీలు చేసి గర్భిణులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. కాన్పుల వార్డులో వీల్‌చైర్‌లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.



